# జీవనతీరం

- అంబికా అనంత్

**సూ**ర్యుడు ఎర్ర బంగారాన్ని చుట్టూ పులుముతూ, పడమటి తెరల్లోకి మెల్లగా జారుతున్నాడు.

బీచ్ మీద కూర్చున్న ఆ నలుగురు స్నేహితులు ఆ అందాన్ని ఆస్వాదిస్తున్నారు. వాళ్ళకి ఈ బీచ్ మీద గంటల్ని క్షణాల్లా గడపటం కొత్త కాదు.

"ఎంత కాలమైపోయింది ఇలా మనం అందరం కలిసి" అన్నాడు ఆనంద్.

"శ్రీ... నువ్వు గల్ఫ్‌కి వెళ్ళిపోయాక ఒకరకమైన నిరుత్సాహం, నిర్వేదం..." రచయిత భాషలో అన్నాడు హర్ష వర్ధన్.

"ఏదో వాడే మనకు ప్రాణాధారమైనట్టు... నాలుగేళ్ళుగా వాడు, తనకు విద్యాబుద్ధుల్ని, అస్తిత్వాన్ని ఇచ్చిన దేశాన్ని వదిలి, పరదేశానికి ఊడిగం చేస్తోంటే..." రమణ అన్నాడు తనదైన నిక్కచ్చి స్వభావంతో "అదే అనొద్దన్నాను రమణా నిన్ను... ఇప్పటికి పదిసార్లన్నా ఇదే విషయాన్ని మార్చి మార్చి అంటున్నావు. నన్ను దెప్పిపొడవటం నీ హాబీ.." అన్నాడు శ్రీవత్స.

"అవును.. నీ బుర్రలోకి కాస్త ఇంగితాన్ని పంపించటానికి ప్రయత్నించటం నా హాబీ... వయసు మీద పడ్డ తల్లిదండ్రుల్ని మీ ఊర్లో, వయసులో ఉన్న భార్యను కంప్యూటర్ క్లాసుల్లో చేర్చి ఈ ఊర్లో, పెళ్ళైన ఆర్నెల్లకే వదిలివెళ్ళావే.. అసలు నువ్వు పోనీ ఆర్థికంగా అట్టడుగున కొట్టుకుంటున్నావా లేదే... కావాల్సినవన్నీ ఉన్నాయి... "సంతృప్తి" అనేది కావాలిరా మనిషికి... నీ లెక్చెర్లు అలవాటే లేవోయ్ అనుకోకు.. నేను నీ కన్నా వయసులో పెద్దవాణ్ణి, చిన్న తమ్ముడికి చెప్పినట్టు నీకు ఒక కథ చెప్తాను విను..." అన్నాడు రమణ.

"నువ్వు కూడా మొదలుపెట్టావా బాబూ కథలు, మనకున్న ఈ రచయిత మహాశయుడు ఒకడు చాలడా..." అన్నాడు ఆనంద్, హర్షవర్ధన్‌ను చూపిస్తూ.

"నేను కథలు రాసేంతవాణ్ణి కాదురా... కానీ కొన్ని కథలు జీవితానికి ఎంత బాగా అన్వయిస్తాయో అర్థం చేసుకోగల పాఠకుణ్ణి..."

రమణకు తన మీద ఈర్ష్యలేదు... తన బాగు కోరే చెప్తున్నాడని తెలుసు శ్రీవత్సకి.. కానీ అతను తన జీవితాన్ని 'డిసెక్ట్' చేస్తున్నాడనిపించినప్పుడల్లా చిర్రెత్తుతుంది శ్రీవత్సకి.

కథ చెప్పటం మొదలుపెట్టాడు రమణ.

"ఇది ఒక తమాషా కథ, కానీ సీరియస్‌గా వినండి.. ఒకసారి ఒక అమెరికా దేశస్థుడు, మెక్సికో దేశంలోని ఒక బీచ్ ఒడ్డున కూర్చున్నాడు. అప్పుడు అతను ఒక బెస్తవాడు చిన్న పడవని ఒడ్డుకి చేర్చి, తను పట్టిన చేపల్ని బుట్టలకెత్తటం చూశాడు. అతను ఆ బెస్తవాడి దగ్గరకు వెళ్ళి, "ఇన్ని చేపలు పట్టటానికి ఎంత సమయం పడుతుంది" అని అడిగాడు...

"ఓ.. చాలా తక్కువ సమయం.."

"మరి అలా అయితే చాలాసేపు సముద్రం మీద ఉండి, ఎక్కువ చేపలు పట్టుకోవచ్చుగా.." అన్నాడు.

"లేదు సార్... నా కుటుంబాన్ని పోషించుకోవటానికి ఇన్ని చేపలు చాలు" అన్నాడు.

"మరి రోజంతా ఏం చేస్తావు?"

"పొద్దున్న ఈ పని పూర్తిచేసి, చేపలు అమ్మి, ఇంటికి వెళ్ళి పిల్లలతో ఆడుకుని, భోంచేసి, మధ్యాహ్నం కాస్త కునుకు తీసి, సాయంత్రం మళ్ళీ భార్యా, పిల్లలతో కాలక్షేపం చేసి, తరువాత స్నేహితులను కలిసి, ఒకటీ అరా సీసాలు తాగి, పాటలు పాడుకుని, హాయిగా ఇంటికి వెళ్ళి, భార్య వడ్డించింది తిని పడుకుంటాను.. మళ్ళీ పొద్దున్నే లేచి చేపలు పడ్తాను.." అన్నాడు.

అమెరికా దేశస్థుడు చాలా ఆశ్చర్యంగా మొహం పెట్టి "భాభా చాలా తప్పు చేస్తున్నావు... నీ జీవితాన్ని మార్చెయ్యగలను... నా సలహా పాటించు. నేను పెద్ద చదువులు చదివాను. నీకు సరియైన దారి చూపిస్తాను.. ఈ రోజు నుండి ఎక్కువ గంటలు సముద్రం మీద గడుపు, ఎక్కువ చేపలు పట్టు. వచ్చే డబ్బుతో ఎక్కువ పడవలు కొను, కొంతమంది బెస్తల్ని పోగేసి ఒక చిన్న కంపెనీ పెట్టు. డబ్బాల్లో చేపల్ని నిలువచేసి దేశదేశాలకు ఎగుమతి చెయ్యి... ఈ చిన్న ఊరు నుంచి పెద్ద నగరానికి వెళ్ళిపో... నీ కంపెనీకి ఎన్నో కొత్త బ్రాంచిలు మొదలవుతాయి. పెద్ద కార్లు, బంగళాలు నీవవుతాయి. కోట్లలో నువ్వు రాజాలా బ్రతకవచ్చు.

"దీనికి ఎంత కాలం పట్టవచ్చు" అడిగాడు బెస్తవాడు.

"సుమారు 15 నుంచి 20 ఏళ్ళు..." అన్నాడు అమెరికా దేశస్థుడు.

"ఆ తరువాత...?!" ప్రశ్నించాడు బెస్తవాడు.

అమెరికా దేశస్థుడు నవ్వుతూ, "ఆ తరువాత నువ్వు హాయిగా సముద్ర తీరంలోని పెద్ద భవనంలో ఉంటూ, భార్యా పిల్లలతో ఆనందంగా కాలం గడపవచ్చు. నీ ఇష్టం వచ్చినప్పుడు నిద్ర లేవచ్చు, రాత్రి పగలు నీ ఇష్టం వచ్చినట్టు గడపవచ్చు అన్నాడు.

ఇప్పుడు బెస్తవాడు ఆశ్చర్యంగా మొహంపెట్టి... "నేను అదే చేస్తున్నాను ఇంతకాలం..." అన్నాడు.

అమెరికా దేశస్థుడి మొహం మీద చిరునవ్వు మాయమైంది. తన సలహా బెడిసికొట్టినందుకు!

"ఎలా ఉంది కథ...?!" నవ్వాడు రమణ.

ఎర్రబడ్డ శ్రీవత్స మొహం చూసి, అతను సమాధానం చెప్పేలోపల, హర్షవర్ధన్ కలగజేసుకుని..

"ఏయ్ బడ్డీస్.. మనం చాలా కాలం తరువాత కలుసుకున్నాం.. ఈ విషయాల మీద వాదోపవాదాలు ఎందుకు? ఒక్కొక్కరికి ఒక్కొక్క దృక్పథం ఉంటుంది. ఎవరి లక్ష్యాలు వారివి..! అన్నాడు.

"ఓకె బాయిస్... 'ఐ యామ్ సారీ' అన్నాడు రమణ.

మామూలు ధోరణిలో పిచ్చాపాటీ చెప్పుకుని, అందరూ ఇళ్ళకు బయలుదేరారు.

"నేను ఇంకొంచెం సేపు ఇక్కడుంటాను" అన్నాడు హర్షవర్ధన్.

"సీయూ..!" అంటూ ఆనంద్, రమణ వెళ్ళిపోయారు.

శ్రీవత్స మాత్రం ఆగిపోయాడు. మనిషి శారీరకంగా తమ మధ్య ఉన్నా, మనసు ఎటో ఉందని గ్రహించాడు. శ్రీవత్సకి హర్ష మీద స్నేహభావం ఎక్కువ... అతనిలోని సున్నితత్వం ఆకర్షిస్తుంది శ్రీవత్సని.

"హర్షా, నీ మనసులో ఏదో నలుగుతోంది... మాతో కూడా చెప్పుకోలేని రహస్యమా..." అన్నాడు శ్రీవత్స హర్ష పక్కనే చతికిలపడుతూ..

"లేదు శ్రీ... అలాంటిదేదీ లేదు..."

"అబ్బ, నువ్వు ఎంత గొప్ప రచయితవైనా, నీ కోతలు నీ రాతల్లో చూపు.. ఇప్పుడు అసలు విషయం చెప్పు.. ఎందుకు ముభావంగా, ఏదో మథనపడుతున్నట్టు ఉన్నావు...?"

"శ్రీ... నీకు కాబట్టి చెపుతున్నాను. నేను ఒక అర్థం కాని సమస్యలో ఇరుక్కున్నాను. సమస్య అనటం సబబు కాదు. ఎందుకంటే నావైపు నుండీ ప్రోద్బలం ఉంది" అన్నాడు హర్ష.

"ఏంటి బాబూ, లేటు వయసులో ఘాటు రొమాన్స్ కాదు కదా..?"

"అలాంటి మాటలు అనకు శ్రీ... కానీ మనసులోని ఈ అలజడికి ఏం పేరు పెట్టాలో నాకు తెలియట్లేదు..!"

"అసలు ఏంటిరా విషయం.." కాస్త సీరియస్‌గా అడిగాడు శ్రీవత్స.

"నీకు తెలుసు, నా కథలకు ఎంత మంది అభిమానులున్నారో... అలాంటి అభిమానం ఫర్వాలేదు.. కానీ ఇది అభిమానం నుండి అనురాగానికి దారితీస్తోందేమోననిపిస్తోంది. అసలు చాలా తమాషాగా మొదలయ్యింది. నేను చాలామంది రచయితలతో, అభిమానులతో కంప్యూటర్ ద్వారా ఛాటింగ్ చేస్తాను. అలాంటి ఓ సందర్భంలో ఒక 'ఆమె'తో పరిచయం కొంచెం ఎక్కువగా పెరిగింది – అలా ఎందుకంటే, ఆమె నా కథలను ఎంత సునిశితంగా, సూక్ష్మంగా, హృదయంతో చూసి విశ్లేషిస్తుందంటే... అదీ చక్కటి భావం నిండిన స్వచ్ఛమైన ఇంగ్లీషులో.. నా మీద నాకే ఒకరకమైన గౌరవం పెరగటం మొదలుపెట్టింది. 'సెల్ఫ్ ఎస్టీమ్' మనిషికి ఒక శక్తినిస్తుంది. అందుకే ప్రతిరోజూ ఆమెతో ఛాటింగ్ చెయ్యకపోతే ఏదో నీరసం, నిస్సత్తువ. టానిక్ తీసుకోవటం మర్చిపోయినట్టుగా ఉంటుంది. "నేను పెళ్ళైన వాడినని, నాకు ఇద్దరు పిల్లలని ఆమెకు తెలుసు... ఒక రచయితగా నా వ్యక్తిగత విషయాలు ఎందరికో తెలుసు.. ఆమె మాత్రం ఒక్కసారి కూడా తన విషయం చెప్పలేదు.. కానీ నా మీద, నా రచనల

## 'ధాం'

**ఒ**క దివ్వెవైవచ్చావు
మదిలోన కాంతి నింపావు
బతుకు పండించావు
మమతల మతాబు నీవు
నాలో ఆశలెన్నో రేపావు
నాతో ఊసులెన్నో చెప్పావు
సంతోషముతో
నా ఎద ఆకాశంలో
తారాజువ్వలా ఎగిసిపోతుంది
మెతుకు దొరికిన బతుకు
చిచ్చుబుడ్డిలా వెలిగింది
ఎవరో కాల్చగా
ఇంకా మిగిలిన 'చేర్ పరాక్ ధాం' అంది–

–కొలనుపాక మురళీధరరావు

మీద ఎంత ఇష్టమో ప్రతిసారీ నాకు బాగా అర్థం అయ్యేలా చెప్తోంది.. ఆమెకు జీవితంలో ఏదో వెలితి ఉంది అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. నా రచనలకు, నా ఆలోచనలకు ఆమె ప్రతిస్పందించే విధానంలోనే అది చాలా తేలికగా బహిర్గతమవుతుంది... ఆమె ఎలా ఉంటుందో తెలియదు కానీ ఆమె యవ్వనంలో ఉందనిపిస్తుంది ఆమె మాటల్లోని ఓ రకమైన 'ఆకర్షణ' 'పట్టు' వలన..! నా రచనలకి తను అభిమానినంటూ, ఆమె రాసే ప్రతి అక్షరానికీ నన్ను బానిసను చేసుకుంది. ఆమె మీద అభిమానం, ప్రేమ పెరగటమే కాదు.. నాకు ఒకరకమైన 'ఎమోషనల్ డిపెండెన్సీ' వచ్చేసింది. ఆమె పంపే మెయిల్స్, చేసిన ఛాటింగ్ సంభాషణలు భద్రపరిచాను..

ఇదిగో.. నిన్ననే ఈ-మెయిల్ వచ్చింది. అది అందినప్పట్నుండీ మళ్ళీ అలజడి గుండెల్లో...

హర్ష చేతికి ఈ-మెయిల్ ప్రింట్ ఇచ్చాడు. మసగ్గా ఉండటంతో ఇద్దరూ లేచి వెళ్ళి, రెస్టారెంట్‌లో ఒక మూల లైట్ కింద కూర్చున్నారు. ఫ్రమ్ 'ఊహ' అని ఉంది- "డియర్ హర్ష – నీతో ఛాటింగ్ పూర్తయింది ఇవాళ్టికి, అయినా నీతో మాట్లాడాలని ఉంది, ఇంకా ఇంకా..! ఈ జీవన సమరంలో ఆటుపోట్లకు నా మనసు ఇంకా కరుడు కట్టకపోవటం, సున్నితంగా ఉండి నీ రచనలకు చలించగలగటం, నన్ను ఒక అలౌకిక ఆనంద స్థితికి చేర్చగలగటం.. ఎంత మంచిది కదూ నా మనసు...? అసలు నువ్వు రాసే ప్రతి అక్షరానికీ శక్తి ఉంది.. ఏం రంగరించి రాస్తావో పుట్టతేనె తీపి కూడా ఉంది...?! హర్షా, నాకు ఈ మధ్యనే కలిగిన కోరిక ఏమిటో తెలుసా, సీరియస్‌గా నువ్వు రాసుకుంటూంటే చూడాలని, మారే ముఖ కవళికలు గమనించాలనీ, నిన్ను డిస్టర్బ్ చెయ్యాలని, కళ్ళల్లోకి పడేలా నీ క్రాఫ్‌ను వేళ్ళతో చెదరగొట్టాలని... తరువాత నీ కోపాన్ని తీయని తాపాన్ని చెయ్యాలని... దానికి నాంది ఏంటో తెలుసా... మధుర చుంబనం.. ఎక్కడి నుండి మొదలుపెడ్తానో తెలుసా... నీ చేతి వ్రేళ్ళ నుండి... నువ్వు అంత అందంగా ఆలోచనల్ని అక్షరబద్ధం చేస్తోంది వాటి సాయంతోనే కదా... వాటితోనే కదా సితార్ తీగెల్ని రాగబద్ధం చేస్తావు.. (ఎన్నిసార్లో కలలో నిన్ను సితార్ మీద నా ప్రియాతి ప్రియరాగం బృందావన్ సారంగి వాయిస్తున్నట్టు చూసాను) హర్షా... నా లేత పెదాల ముద్రలు నీ వ్రేళ్ళ మీద పడ్డాక అవి ఇంకా ఎంత స్పీడు నేర్చుకుంటాయో చూడు...!"

ముచ్చటైన భాషలో, వెచ్చగా సాగుతున్న ఆ ఉత్తరాన్ని చదువుతూంటే శ్రీవత్స ఊపిరి బరువెక్కింది... నరనరాల్లో ఏదో వెచ్చదనం... తాగుతున్న కూల్‌డ్రింక్ పెదాలకు వేడిగా తగిలింది. ఇంత అందమైన, తీవ్రమైన, సున్నితమైన భావాలు ఉన్న స్త్రీ సాంగత్యం ఎంత బావుంటుంది అనుకుంటూ...

"హర్షా.. రచయితగా నీకు వచ్చిన గుర్తింపు, అవార్డుల వలన కలగని అసూయ, ఈ ఉత్తరాన్ని చూస్తోంటే కలుగుతోంది... 'దిస్ లేడీ సీమ్స్ టు బి వండర్‌ఫుల్' అన్నాడు దాచుకోలేని భావాలతో-

"మళ్ళీ ఉత్తరం చదవటం మొదలుపెట్టినా, హర్ష మనసు లేత పెదాల ముద్దుల దగ్గరే ఆగిపోయింది. ఏదో తెలియని అనిర్వచనీయమైన అనుభూతిని పొందుతూ, ఉత్తరాన్ని పూర్తిచేశాడు.

"అవును హర్షా... ఆమె నిన్ను చాలా కోరుకుంటోంది. స్త్రీలో కోరిక మొదలవటం కష్టం, మొదలయ్యాక అది ఒక జలపాతం వేగంతో సాగుతుంది. తప్పదు, నీ నైతిక సూత్రాలు పక్కన పెట్టి, ప్రేమ సూత్రానికి పట్టుబడిపో... ప్రొసీడ్ అయిపో... ఆమెను ఇక నువ్వు కలవాల్సిందే.. ఎక్కడో ఎప్పుడో తెలుసుకో. నీ భార్యని మోసం చేయమనో, ఎల్లకాలం ఈమెతో ఉండిపొమ్మనో నేను చెప్పట్లేదు.. కానీ ఈ రసరమ్య అనుభవాన్ని మాత్రం కాలదన్నుకోకు."

"నీకు మస్కట్‌లో ఇలాంటి అనుభవాలు ఉన్నాయా...?" అడిగాడు హర్ష.

"అబ్బో.. ఇంపాజిబుల్.. అయినా నాకు అంత టైం ఎక్కడిది. నా భార్యతోనే ఫోన్‌లో ఒక నిముషమో, అర నిముషమో మాట్లాడుతాను. నేను రచయితను కాను బాబూ... 'మెషీన్ అండ్ మనీ'తోనే నాకు సంబంధం... కథలు, కవితలు, గుండె కోతలు నాకు అసలు తెలియవు.. అందుకే ఫ్యాన్సు, ఏసీలు నాకు లేరు.. నువ్వు మాత్రం నీ చేతికి అందిన ఈ స్వర్గాన్ని జారవిడుచుకోకు. ఆమెను తప్పక కలుసుకో... ఆపైన..! అర్థవంతంగా నవ్వుతూ హర్ష చేతిని నొక్కి, అదే హుషారులో ఇంటికి బయలుదేరాడు శ్రీవత్స.

❍ ❍ ❍

తన దగ్గరున్న తాళం చెవితో తలుపు తెరుచుకుని ఇంట్లోకి వెళ్ళాడు శ్రీవత్స. కుర్చీలో నిద్రపోతూ కనిపించింది భార్య అరుణ. "తనకోసం ఎదురు చూసి ఉంటుంది. అలిసిపోయుంటుంది. టైంకి అన్నీ అమరుస్తూ, ఒక కీ ఇచ్చిన యంత్రంలా పనిచేస్తుంది... స్వీట్ అరుణ... తను ఇంకా బాగా డబ్బు సంపాదించి, ఇండియా తిరిగొచ్చి, నౌకర్లు నిండిన బంగళాలో అరుణని ఉంచాలి. సుఖం అంటే ఏమిటో చూపాలి" అని ఆలోచిస్తూ, ఆమెను డిస్టర్బ్ చేయకుండా, బట్టలు మార్చుకుని, తన కంపెనీకీ అర్జెంట్‌గా పంపాల్సిన ముఖ్యమైన ఉత్తరం విషయం గుర్తుకు వచ్చి, గబగబా వచ్చి గదిలోని కంప్యూటర్ ముందు కూర్చుని క్లిక్ చేసాడు...

ఒక పేజీ ఆటోమాటిక్‌గా ఓపెన్ అయ్యింది... క్లోజ్ చెయ్యబోతో, యథాలాపంగా ఏమిటా అని చూసాడు... Personal doc.ooha అని ఉంది. ఆ పేరు విన్నట్టుగా అనిపించింది. చటుక్కున ఏదో గుర్తుకొచ్చింది.. గుబగుబలాడుతున్న గుండెతో చదవడం మొదలుపెట్టాడు శ్రీవత్స...

ఇందాక హర్ష చూపిన ఉత్తరంతో పాటూ, ఇంకా ఎన్నో మెయిల్స్, హర్ష-అరుణల మధ్యని ఛాట్ సంభాషణలు, ఆమె అభిప్రాయాలూ, ఆలోచనలు...

"గాడ్... హర్షను పిచ్చిగా ప్రేమించే అభిమాని - తన భార్య అరుణ. గుండెలవిసిపోయాయి శ్రీవత్సకి. హర్ష చూపించినప్పుడు నరాల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపిన ఉత్తరం, ఇప్పుడు పదునైన కత్తిగా మారి నరాల్ని తెగ్గొట్టేస్తున్నట్టుగా అనిపిస్తోంది శ్రీవత్సకి. తను ఏం సలహా ఇచ్చి వచ్చాడు హర్షకి.. 'ఆ రసరమ్య అనుభవాన్ని' వదులుకోవద్దని... తనదయిన అనుభవం... చేతులారా స్నేహితుడి చేతుల్లో నింపబోయాడు తను.. గుండె మెలి తిరిగిపోతోంది శ్రీవత్సకి!

చిన్న పాపాయిలా ఒదిగి నిద్రపోతున్న అరుణను లేపి గూబ అదిరేలా కొట్టి... ఏమిటిదంతా అని అడగాలనిపించింది... కోపంతో వళ్ళు కంపించిపోతోంది.. ఆమె వైపు అడుగు వేయబోయిన అతను, ఒక్క క్షణం ఆగాడు... గుండెల్లో నుండి ఇందాక రమణ చెప్పిన కథ తన్నుకొచ్చింది... ఎంత నిజం చెప్పాడు రమణ... ఆ కథ ఎంత బాగా తనకు వర్తిస్తుంది...?! సముద్రంలో చేపలు పడుతూ, పడుతూ తను ఎంత దూరం వెళ్ళిపోయాడు తీరం నుండి... తీరం మీదనున్న తన వాళ్ళకు డబ్బు ఇవ్వలేని సుఖాలు ఉన్నాయని, అవి మనసుకి సంబంధించినవని తెలుసుకోలేకపోయాడు... ఏనాడన్నా అరుణ భావాలకు, కోర్కెలకు, ఆశలకు ప్రాముఖ్యత ఇచ్చాడా..? ఎప్పుడు ఫోన్ చేసినా కరెంటు బిల్లు, బ్యాంక్ బ్యాలెన్స్ – ఈ విషయాలు తప్ప ఇంకేమైనా మాట్లాడాడా తను? సున్నిత భావాలు కల అరుణ, హర్ష లాంటి రచయితకు దగ్గర కావటం ఎంత సహజం.. ఆమె హర్షకు రాసిన ఉత్తరాల్లోని మాధుర్యం, తమకం గుర్తుకొచ్చాయి, తన పొడి సంభాషణలు గుర్తుకొచ్చాయి... స్త్రీ మనసుని అర్థం చేసుకోకుండా, ఆర్నెల్ల దాంపత్య జీవనాన్ని గుర్తు పెట్టుకుని, నాలుగేళ్ళుగా దాన్ని గుర్తుతెచ్చుకుంటూ బ్రతక మని, తను మూటలు పోగేసుకొస్తానని వెళ్ళిపోయి ఆమెకు శిక్ష వేసాడు తను, అందుకే ఇప్పుడీ శిక్ష అనుభవిస్తున్నాడు తను...!

గుండె నిండా ఒకరకమైన చేదు నిండినట్టయ్యింది శ్రీవత్సకి. అరుణతో పరిచయం హర్షకు మరింత 'సెల్ఫ్-ఎస్టీమ్' పెంచితే తన 'సెల్ఫ్'నే చంపేసింది. "ఎలా... ఇప్పుడెలా...?!" గుండెల్లో ఘోష!

కొంచెం తమాయించుకుని ఆలోచించటం మొదలుపెట్టాడు శ్రీవత్స! అరుణ ఎవరో హర్షకు ఇంకా తెలియదు.. 'ఊహ' అనే 'ఆమె' ఊహల్లో ఉన్నాడు తప్ప – శ్రీవత్స, హర్షలు స్నేహితులన్న విషయం అరుణకు తెలియదు. భగవంతుడా, ఈ విషయంలో నాకు మేలు చేసావు... తన పెళ్ళై ఆమెను ఇక్కడకు తీసుకొచ్చినప్పుడు హర్ష హైదరాబాద్‌లో ఉన్నాడు, వాడు వైజాగ్ వచ్చి రెండేళ్ళే అయ్యాయి. వాళ్ళిద్దరూ కలిసే సందర్భమే రాలేదు. 'థాంక్ గాడ్' మళ్ళీ అనుకున్నాడు ఒకసారి.

"రమణా... నువ్వు చెప్పిన కథలో లాగా, కొందరు బెస్తవాడి లాగా జీవితాన్ని, కాలాన్ని, సంపాదనని, ప్రేమల్ని అన్నింటినీ సంఘటించి, సమన్వయించి బ్రతుకుతారు, మరికొందరు నాలాగా జీవన సాగరంలో గాలాలు వేస్తూ వేస్తూ, సంపాదిస్తున్నామనుకుంటూ, అన్నీ కోల్పోతారు. నేను మాత్రం ఏదీ కోల్పోకుండా, తీరం మీద ఉన్న నా ఆణిముత్యాన్ని గుండెల్లో పదిలపరుచుకుంటాను. ఆమెలోని సున్నితత్వం, భావావేశం, ఆమె అందించే 'రసరమ్య అనుభవం' అన్నీ నాకే సొంతం చేసుకుంటాను. హర్షను అరుణ మర్చిపోయేలా ప్రేమ మంత్రం వేస్తాను."

అరుణ, హర్ష లాంటి ఇద్దరు మంచి మనుషుల్ని తను కోల్పోకూడదు. ఆమె మంచితనంతో గిరిగీసుకుని ఉంది కాబట్టి, కేవలం కంప్యూటర్ ద్వారా మరో సున్నిత మనస్సుకికి ఆకర్షితురాలయ్యింది... హర్ష ఎంతో నీతివంతుడు కాబట్టి, ఒక స్త్రీ అంతగా తనని కోరుకుంటున్నా, తటపటాయించాడు తప్ప ఆ అవకాశాన్ని వాడుకోలేదు. ఇంక ఆ అవకాశాన్ని వాడుకునే ఛాన్స్ తను ఇవ్వడు.

భార్యను తనతో తీసుకొచ్చి కాపురం చేయగలిగే అవకాశం ఇవ్వని ఆ ఆయిల్ కంపెనీకి ఒక నమస్కారం పెట్టి, తను కారణాంతరాల వల్ల తిరిగి మస్కట్ రాలేకపోతున్నానని తన కంపెనీకి ఉత్తరం రాయటం మొదలుపెట్టాడు శ్రీవత్స. వైజాగ్ నుండి మకాం మార్చి, 'ఊహ' అనే ఆమె విషయం ఎన్నటికీ అరుణతో చెప్పనని, ఆమె తనలోనే సమాధి అవుతుందని నిర్ధారణకొచ్చిన శ్రీవత్సకు గుండె తేలికయ్యింది...

■